# నరస్తుతి

"**మ**గ తాతవయ్యావన్నమాట" అన్నాడు వస్తూనే మిత్రుడు.

"ఈ మగ తాతేమిటి?" అని అడిగారు ఆవని శాస్త్రిగారు.

"మగతాతంటే కొడుక్కి పిల్లలు పుట్టడం అన్నమాట. అదే కూతురికి పిల్లలు పుడితే 'ఆడతాత' అంటారు వివరించాడు మిత్రుడు. శాస్త్రిగారి మిత్రుడు గొప్ప వక్త. అనాలోచితంగా మాట్లాడిన మాటలు కూడా సమర్థించుకోగల దిట్ట.

"చాల మంచి భాష్యం! బారసాలకు వెడదాం నువ్వు తప్పకుండా రావాలి" అన్నారు శాస్త్రి.

శాస్త్రిగారి కుటుంబం వారి అగ్రహారంలో, వన్నెకెక్కిన కుటుంబం. అందుకే శాస్త్రిగారు, మిగిలిన విషయాలకి ప్రాధాన్యత యివ్వకుండా, మంచి కుటుంబంలోని పిల్లని కోడలిగా తెచ్చుకున్నారు.

శాస్త్రిగారు, ముందునుంచీ ఒక పద్ధతి కలమనిషి. అందుకే ఉద్యోగంలో అక్రమార్జనకు, అవకాశం వున్నా డబ్బుకి కక్కుర్తి పడలేదు. రిటైర్ అయిన తర్వాత కాని ఒక యిల్లు కట్టలేకపోయారు. అదికూడా చాలా చిన్నది. ఇల్లు కట్టడానికి ఎక్కువ ఖర్చవడం వలన, కోడలికి పెళ్లిలో మంచి నగలు పెట్టలేకపోయారు. కోడలికి పెట్టిన పట్టుచీరలు కూడా అంతంత మాత్రమే.

"వీడే పెద్దకొడుకు కదండీ! పెళ్ళి ఘనంగా చేద్దాం" అని భార్య పదేపదే చెప్పినా, ఆ మాటలు చెవిన వేసుకోలేదు.

"శాస్త్రీయంగా, మంత్రయుక్తంగా, పద్ధతి ప్రకారం జరిగేదే పెళ్ళి" అని నిష్కర్షగా చెప్పారు భార్యతో.

మనవడు పుట్టినందుకు చాలా ఆనందించారు. నిత్య పూజా విధానాలు, సంధ్యావందనం వగైరా అన్నీ మనవడికి నేర్పాలని తహ తహ శాస్త్రిగారికి. కుటుంబాలు సాంప్రదాయసిద్ధంగా వుండాలని, క్రొత్తగా ఏమీ కీర్తి సంపాదించలేమనీ, పెద్దలు సంపాదించిన కీర్తి మాత్రం పోగొట్టకూడదని ఆయన నమ్మకం. మనవడికి ఒక బంగారు గొలుసు చేయించారు. 'పురుషోత్తమ్' అనే పేరు పెట్టారు. అయిదో నెలలో

కోడల్ని, మనవడ్ని తీసుకువచ్చారు. కొడుకు, కోడలు మనవడిని తీసుకుని, అయిదో నెలలోనే ముంబై వెళ్ళిపోయాడు.

శాస్త్రిగారికి, భార్యకి మనవడిని ఎత్తుకున్నట్లుగానే లేదు, మగ పిల్లాడు పుట్టాలని చాలా పూజలు చేశారు, ఈ దంపతులు. ముఖ్యంగా శాస్త్రిగారు బాలకాండలోని శ్రీరామజననమ్ సర్గ పదేపదే పారాయణ చేశారు. ఈ సర్గ పారాయణచేస్తే ఆడవారికి పురుడు సులువుగా వస్తుందని, మంచి పిల్లలు పుడతారని ఎవరో చెప్పారట ఆయనికి. ఈ పారాయణ ఫలించింది. మనవడిది నవ్వు ముఖం! మంచి రంగు కూడా, అందుకే మనవడు కళ్ళ ముందు లేకపోయినా, చాలాసార్లు గుర్తుకు వస్తాడు.

మనవడ్ని చూడాలంటే ముంబాయి దాకా తరచుగా వెళ్లలేరుకదా! పెన్షన్ తప్ప ఏమీ ఆధారం లేదు. ప్రయాణ ఖర్చులు కూడా విపరీతంగా పెరిగాయి. అదీకాక ముంబాయి వెళ్లినా అక్కడ వుండడానికి వసతి లేదు. ముంబాయి వంటి మహానగరంలో ఒక్క గది దొరకడమే గగనం. ఏదో భగవంతుని దయవలన తన కొడుక్కి మాత్రం, ఒక జానా బెత్తెడు కొంప దొరికింది.

కొంతకాలం తర్వాత మనవడు శాస్త్రి దగ్గరకు పాకుతూ వచ్చి, ఆయన పక్కలో పడుకున్నట్లు కల వచ్చింది. ఉదయం లేవగానే భార్యతో ఈ విషయం చెప్పారు.

"అస్తమానూ మీకు వాడిమీద దృష్టి! కలెందుకు రాదూ" అన్నది ఆవిడ. రక్తపాశం చాలా బలమైనది. అందుకే అంటారు, 'నీళ్లకంటే రక్తం చిక్కనని!".

ఎలా అయితేనేం, యింక మనవడ్ని చూడకుండా వుండలేక శాస్త్రిగారూ, భార్యా ముంబాయి వెళ్లారు. అక్కడ నాలుగురోజులే వుండగల్గారు. అవతల చూస్తే గది చాలా చిన్నది. వంటిల్లు అయితే చెప్పనే అక్కర్లేదు! ఒకేసారి నలుగురూ కూర్చుని ఆప్యాయంగా మాట్లాడుకుంటూ భోజనం చేసే అవకాశమే లేదు. పైగా కోడలు మనస్సులో ఏముందో తెలియదు గాని కొంచెం ముభావంగా వుంది. ఆప్యాయతగా వుంటే అక్కడే వుండిపోతారు అనుకుందేమో! పిల్లాడ్ని ఎత్తుకున్నప్పుడల్లా, స్నానం చేయించాలనీ, పాలుపట్టాలనీ వాడికి నిద్రవస్తోందనీ సాకులు చెప్పి వాడ్ని తీసుకునేది.

శాస్త్రిగారూ, భార్యా వైజాగ్ వచ్చేసారు. ఒకరోజు సాయంకాలం, వాలు కుర్చీలో కూర్చుని కళ్లుమూసుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నారు శాస్త్రిగారు. ఆయన అంత దీర్ఘంగా ఆలోచించడమనేది అరుదు. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూనో, లేకపోతే త్యాగరాజ కీర్తనలుగాని, అన్నమయ్య కీర్తనలుగాని వింటూ మైమరచిపోతారు.

అటువంటిది "ఏమిటి, యిలా ఆలోచిస్తున్నారని" ఆయన్నే అడిగింది భార్య.

"ఏముందీ కోడలు తంతు నాకేమీ నచ్చలేదు. మనం కట్నకానులకి ప్రాధాన్యం యివ్వకుండా, చదువు చిన్నదైనా, పిల్ల పెద్ద .ఛాయ లేకపోయినా మంచి కుటుంబం" అని ఈ పిల్లని చేసుకున్నాం.

మన పిల్లవాడు పోస్టుగ్రాడ్యుయేట్‌ని చేసుకుందామంటే, "యీ పిల్ల ఇంటర్ చదివిందని వెనక్కి నెట్టకు, సంస్కారం లేని చదువు వ్యర్థం" అని వాడికి నచ్చచెప్పి వాడనని ఒప్పించాను. వాళ్ల క్షేమం గురించి నిత్యం పూజలు చేశాను, చేస్తున్నాను కూడా. కష్టపడి ముంబాయి వెడితే మనసారా మనవడ్ని ఎత్తుకోడానికి అవకాశం దొరకలేదు. నువ్వూ చూసావుకదా! మనం చేసిన తప్పు ఏమిటో నాకు అర్థంకాలేదు. ఈ ముసలితనంలో, యిటువంటి విషయాలు తట్టుకోవడం కష్టం కాదా!" అన్నారు శాస్త్రిగారు.

ఆయన భార్య కళ్ళమ్మట నీళ్లు పెట్టుకుంది. "ఏడవకు శుక్రవారం కూడాను" అని, సముదాయించారు శాస్త్రి, సహృదయంతో.

తర్వాత కొంతకాలానికి వాళ్ళు ముంబాయి నుంచి వచ్చారు. మళ్ళీ యించుమించు కోడలు యిదే తంతు. శాస్త్రి ఆలోచించారు. కోడలు తన పద్ధతి మార్చుకొనకపోతే తానే తగ్గాలని, 'ఒకచో నేలన్ పవ్వళించు" అనే, భర్తృహరి సుభాషితం, మననం చేసుకున్నారు.

కోడలికి ఒక జత గాజులు చేయించారు. నాలుగు మంచి చీరలు కొనిచ్చారు. యివన్నీ చూసి కోడలు "ఎందుకండీ! యివన్నీను" అంటూ తన సూట్ కేసులో పెట్టుకుంది.

మళ్ళీ వాళ్ళు ముంబాయి వెళ్ళిపోతారు, కోడలికి యిష్టమైనవి చెయ్యమని, కోడలు వింటూండగా, భార్యతో చెప్పేవారు. అసలు సినిమాలు అంటే యిష్టం లేని

శాస్త్రి, కోడలితో, "ఒక్క సినిమా అయినా చూసి, డాల్ఫిన్ హెూటల్లో భోజనం చేసిరండి" అని మూడు వందల రూపాయలు కోడలు చేతిలో పెట్టారు.

నువ్వు చాలా బాగా పాడతావని, నీ పెళ్ళిచూపుల్లో మీవాళ్ళు చెప్పారు. అప్పుడు నేను విన్న కీర్తన తప్ప మళ్ళీ వినలేదు. ఏదీ! అవకాశం లేదులే! మీరు ముంబాయీ! మేము వైజాగ్‌నూ!

"ఏదీ! మనసులోని మర్మమును తెలుసుకో..." అనే త్యాగరాజ కీర్తన ఒక్కసారి వినిపించు తల్లీ! అని అడిగి పాడించుకున్నారు.

"చాలా అద్భుతంగా పాడావమ్మా! నిజంగా త్యాగరాజు మహనీయుడమ్మా!" అన్నారు. ఇలాకోడల్ని మంచి చేసుకుని, మంచిచేసుకుని, మనవడ్ని ముద్దాడి మైమరచిపోయారు శాస్త్రిగారు.

వాళ్ళు మళ్ళీ ముంబాయి వెళ్ళిపోయారు. "మీకు కూడా లౌక్యం తెలుస్తోంది" అంది శాస్త్రిగారి భార్య చిరునవ్వుతో.

"ఆ! ఏదోలే, ఏం లౌక్యం!" అన్నారు శాస్త్రి "ఏదోలే ఏం కాదులెండి! కోడల్ని బాగానే బుట్టలో వేసుకున్నారు. ఆడవాళ్లకి నగలు చీరలు యిష్టమని, వాటిని ప్రయోగించారు. వుండండి నేను కూడా కొంచెం బెట్టుగా వుండి, మీ బహుమానాలు పొందుతాను" అంది ఆవిడ.

మురిపించే మనవడ్ని ముద్దులతో నింపడానికి, నా దగ్గర లేకపోయినా ధైర్యం చేసి అంత డబ్బు ఖర్చుపెట్టాను. 'ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు" అన్నారు, మనోహరమైన అన్నమయ్య కీర్తన గుర్తుచేసుకుంటూ. రెండేళ్లు గడిచాయి. ఈసారి, వాళ్ళు కోడలు చెల్లెలి పెళ్ళికి వచ్చారు. పెళ్ళిలో మనవడ్ని ఎత్తుకోబోయిన శాస్త్రి మీద కోడలు చిరాకు చూపింది. ఆయన బాధపడ్డారు. ఈసారి మనవడ్ని ఎక్కువసార్లు ఎత్తుకోనివ్వలేదు. ఈ చీరలు పాతపడి పోయాయేమో!

"తాతా, తాతా" అంటూ మనవడు ముద్దుగా పిలుస్తూ, నడచి దగ్గరికి వస్తూంటే, గండపెండేరం, గజారోహణము పొందినంత పొంగిపోయారు. తర్వాత ఎకాయికీ పెళ్ళినుంచే వాళ్లు ముంబాయి వెళ్ళిపోయారు.

"ఏమయ్యా! మగతాతా" అంటూ మళ్ళీ వచ్చాడు పాతమిత్రుడు. శాస్త్రి తన విషయాలు, వివరంగా అతనికి చెప్పి బాధపడ్డారు. "నేను, ఒక బేలలా

అయిపోయాను. నేను ఆడతాతనే కాని. మగతాతను కాను, మనవడ్ని స్వతంత్రంగా ఎత్తుకోలేని తాత "మగతాత" ఎలా అవుతాడు చెప్పు" అన్నాడు శాస్త్రి.

"నీవు కోడలిని తప్పు పట్టక్కర్లేదని నా ఉద్దేశ్యం. నీ కొడుక్కి దేశంలో ఎక్కడికైనా ట్రాన్స్‌ఫర్లు అవుతాయికదా! ఈ రోజు ముంబాయి, రేపు ఇండియాలో ఎక్కడికో తెలియదు! మనవడికి నీ దగ్గర బాగా అలవాటైందనుకో వాడు, బెంగ పెట్టుకోవచ్చు. వాడు బెంగపెట్టుకుని, చిక్కిపోతే నీ కోడలు తట్టుకోగలదా! అందుకని భయపడి ఆ పిల్ల అలా చేస్తుందేమో! నీవే ఆలోచించు. నువ్వు అన్ని విషయాలూ భూతద్దంలో చూడకు! అయినా నువ్వు వట్టి శాస్త్రివటయ్యా! అవని శాస్త్రివి! భూదేవంత ఓర్పు నీకుండాలనే నీకా పేరు పెట్టించి వుంటాడు భగవంతుడు. ఎంతో చదివినవాడవు. మమకారం దేనిమీదా పెంచుకోకూడదని, నీకు తెలియని విషయం కాదు. మన జీవితాలు సాయం సమయంలో వున్నాయి" అంటూ ఒక వేదాంత ధోరణిలో చెప్పాడు, మిత్రుడు.

"దేనిమీదా మమకారం పెంచుకోకూడదంటాడు. అంటే మనవడి మీద కూడానా! అదెలా సాధ్యమవుతుంది వీడికి మనవడు పుడితే తెలుస్తుంది" అనుకున్నారు శాస్త్రి.

శాస్త్రిగారు మిత్రుడ్ని సాగనంపి, లోపలికి వచ్చేసరికి , టీవిలో త్యాగరాజ కీర్తనలు వస్తున్నాయి. "నిధి చాలా సుఖమా! రాముని సన్నిధి సేవ సుఖమా!... మమతా బంధనయుత నరస్తుతి సుఖమా!" అనే కీర్తనతో ఆ ప్రోగ్రామ్ ముగిసింది. ఈ కీర్తన అంటే చాలా యిష్టం శాస్త్రిగారికి.

ముద్దుగారే మనవడి మోజులోపడి, యిష్టమైన వన్నీ మరచిపోయారు పాపం!, శాస్త్రిగారు.

(ఆంధ్రభూమి, ప్రియదర్శిని, 8-5-2004)